కొనసాగుతున్న విజయోత్సవాలు

- మున్సిపాలిటీల్లో ర్యాలీలు
- ఉత్తమ కార్మికులకు సన్మానం



ఆర్‌కేపీలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, అధికారులు

రామకృష్ణాపూర్: ప్రజాపాలన విజయోత్సవాలను మంగళవారం క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని విఠల్‌నగర్ నుంచి రాజీవ్‌చౌక్ వరకు ర్యాలీ చేపట్టారు. మున్సిపల్ కార్యాలయంలో ఉత్తమ కార్మికులను సన్మానించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ జి.రాజు, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు జెండా ఊపి ప్రారంభించగా పాత బస్టాండ్ వరకు సాగింది. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే ఓదెలు హాజరయ్యారు. పలువురు పారిశుద్ధ్య కార్మికులతో పాటు మెప్మా సిబ్బందిని సన్మానించి ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్, మెప్మా సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి తెలంగాణ రైజింగ్, ప్రజాపాలన విజయోత్సవాల ర్యాలీని మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ మేనేజర్ కె.విజయ్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉదయ్, మెప్మా చంద్రయ్య, ఆర్పీలు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

నస్పూర్: పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ సురమిల్ల వేణు అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది సీసీసీ రాయల్ గార్డెన్ నుంచి సీసీసీ కార్నర్ వరకు ర్యాలీ నిర్వహించారు. సీసీసీ కార్నర్ వద్ద మానవహారం నిర్వహించారు.

వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: అనారోగ్య సమస్యలతో ఉన్న విద్యార్థులను గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్య చికిత్స అందించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో జిల్లా వైద్య–ఆరోగ్యశాఖ అధికారి డా.హరీష్ రాజ్, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు హరిశ్చంద్రారెడ్డితో కలిసి మంగళవారం సంక్షేమ శాఖల అధికారులతో విద్యార్థుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీరోజు విద్యార్థుల ప్రవర్తనను పరిశీలించి, ఏమైనా మార్పు కనిపిస్తే సంబంధిత విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించాలన్నారు. జిల్లాలో దాదాపు 12వేల మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారని, వైద్య–ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తూ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఫలితాల ప్రకారం తగు వైద్యం అందించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి నీరిటి రాజేశ్వరి, జిల్లా సమన్వయకర్త నాగేశ్వర్, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

చెన్నూర్: ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు కట్టుబడి ఉందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పారిశుద్ధ్య కార్మికులకు ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను సందర్శించి కార్మికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఉత్తమ శానిటేషన్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. ప్రజాపాలనలో ప్రజలకు స్వేచ్ఛ ఉందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో మాట్లాడితే కేసులు పెట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

జైపూర్: మండలంలోని టేకుమట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన డీసీఎంఎస్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలని, నాణ్యమైన ధాన్యాన్ని సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీనివాస్, నర్సయ్య, సత్యనారాయణరెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పిచ్చి మొక్కలు తొలగించారు



సాక్షి స్పందన

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లిలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి ప్రమాదకరంగా ఉందని 'సాక్షి'లో 'ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సంబంధిత లైన్‌మెన్ శ్రీనివాస్‌కు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ ఆదేశించగా, మంగళవారం సిబ్బందితో పిచ్చి మొక్కలు తొలగింపజేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

రుణ లక్ష్యం పూర్తిచేయాలి



లింగయ్యను సన్మానిస్తున్న డీపీఎం

దండేపల్లి: 2024–25ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని డీపీఎం సంజీవ్ సూచించారు. దండేపల్లి శ్రీలక్ష్మీ మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం బ్యాంకు లింకేజీ రుణలక్ష్యంపై వీవో ఏలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని మామిడిపల్లి గ్రామ వీవోఏ కొప్పుల లింగయ్య రుణ లక్ష్యాన్ని గడువుకు ముందే పూర్తి చేయడంతో అతడిని శాలువాతో సన్మానించారు. ఏపీఎం బ్రహ్మయ్య, మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు అనిత, రజిత, సీసీలు వీవోఏలు పాల్గొన్నారు.

ఘనంగా న్యాయవాదుల దినోత్సవం



సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

బెల్లంపల్లిరూరల్: జాతీయ న్యాయవాదుల దినోత్సవాన్ని మంగళవారం బెల్లంపల్లిలో ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ బెల్లంపల్లి, లయన్స్ క్లబ్ స్త్రీ శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది వంగల ఉమారాణిని శాలువాతో క్లబ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ స్త్రీ శక్తి అధ్యక్షురాలు దీకొండ లత, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కటుకూరి సత్యనారాయణ, కార్యదర్శి పైడాకుల రాజన్న, స్త్రీ శక్తి కార్యదర్శి మేరుగు సంధ్య, ప్రతినిధులు రాజలింగం, ప్రభాకర్, శారద, జయశ్రీ, సింగరేణి లయన్స్ క్లబ్ కార్యదర్శి వంగల చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడు శ్రీకాంతాచారి వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి త్యాగం మరువలేనిదని జిల్లా, పట్టణ స్వర్ణకార సంఘం నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలో జిల్లా, పట్టణ స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ అమరవీరుడు కాసోజు శ్రీకాంతాచారి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మవరం బ్రహ్మయ్య, పట్టణ స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు రమేష్, కార్యదర్శి బాణాల క్రాంతి, స్వర్ణకారుల సంఘం పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

'మంత్రి పదవి కోసమే వివేక్ ఆరాటం'

నస్పూర్: కేవలం మంత్రి పదవి కోసమే చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఆరాట పడుతున్నారని మాదిగ హక్కుల దండోరా జాతీయ అధ్యక్షుడు దండు సురేష్ మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ ఆరోపించారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించిన మాలల సింహగర్జన సభ వివేక్ స్వార్థం కోసమే తప్పా, మాలలపై అభిమానంతో కాదన్నారు.

మున్సిపల్ ట్రాలీల నుంచి పెట్రోల్ చోరీ..?

- 5 లీటర్ల పెట్రోలు తీసి పట్టుబడిన కార్మికుడు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీకి చెందిన చెత్తను తరలించే ఆటో ట్రాలీలో మంగళవారం ప్లాస్టిక్ బాటిళ్లలో 5లీటర్ల పెట్రోలును ట్రాలీ డ్రైవర్ తన సీటు వద్ద కవర్లో దాచి ఉంచడం చర్చనీయాంశంగా మారింది. ఉదయం ఆటో ట్రాలీలో చెత్తను తరలించేందుకు వచ్చిన కాంట్రాక్టు కార్మికుడు దాసరి సుమన్, మధ్యాహ్నం విధులు ముగించుకొని ఆటోను మున్సిపల్ కార్యాలయం వద్ద ఉంచేందుకు తీసుకుని రాగా, ట్రాలీ డ్రైవర్ సీటు వద్ద ప్లాస్టిక్ బాటిళ్లలో ఐదు లీటర్ల పెట్రోలును పోసి దాచి ఉంచడాన్ని ఇతర కార్మికులు గుర్తించారు. దీనిపై మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం యూనియన్ నాయకులకు సమాచారం అందడంతో, వెంటనే అక్కడికి చేరుకొని యూనియన్ నాయకులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్మికుడు తన అవసరం కోసం పెట్రోల్ కొనుగోలు చేసుకున్నానని, కాల్టెక్స్ పెట్రోల్ బంకు నుంచి తెచ్చుకున్నానని చెబుతుండగా, ఆ పెట్రోల్ బంకు కొన్ని రోజులుగా మూతపడి ఉండడంతో, నిత్యం మున్సిపల్ ఆటో ట్రాలీ నుంచి పెట్రోల్‌ను దొంగిలిస్తున్నట్లుగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కొందరు ఆటో ట్రాలీ డ్రైవర్లు నిత్యం మున్సిపల్ వాహనాల నుంచి పెట్రోల్ దొంగిలిస్తున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పెట్రోల్ దొంగతనంపై మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌ను వివరణ కోరగా.. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో విచారణ జరిపించి, చర్యలు తీసుకుంటామన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

- రూ.3,826 రికవరీకి ఆదేశాలు
- వివరాలు వెల్లడించిన ఈజీఎస్ సిబ్బంది

నెన్నెల: మండలంలోని 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై పది రోజులుగా 19గ్రామపంచాయతీల్లో 289పనులకు సోషల్ ఆడిట్ చేపట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీలో చేపట్టిన పనులపై 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం డీఆర్‌డీఓ కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలో 34గ్రామాల్లో చేపట్టిన వివిధ పనులపై నివేదికలను ఈజీఎస్ సిబ్బంది చదివి వినిపించారు. మండలంలో మొత్తం రూ.4కోట్ల 14లక్షల 49వేల 685ఖర్చు చేయగా కూలీలకు వేతనాలుగా రూ.4కోట్ల లక్ష 30వేల 423, రూ.11,14,233లక్షల మెటీరియల్ చెల్లింపులు జరిగినట్లు అధికారులు తెలిపారు. రూ.3,826 రికవరీకి ఆదేశించారు. ఉపాధిహామీ మెటీరియల్ నిధులతో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం వారు రూ.2.25కోట్ల పనులు చేయగా ఆ రికార్డులను సామాజిక తనిఖీ బృందం వారికి ఇవ్వలేదు. దీనిపై డీఆర్‌డీఓ కిషన్ చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ సిబ్బంది పని ప్రదేశంలో కూలీల మస్టర్లపై సంబంధిత అధికారులు రోల్‌కాల్ చేయకపోవడం, కొలతల్లో తేడాలు, మస్టర్లలో కూలీల సంతకాలు హాజరులేకుండా వేతనాల చెల్లింపులు, మస్టర్ల హాజరు గణణ లెక్కింపులో తప్పిదాలు జరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి కిరణ్, జిల్లా అంబుడ్స్‌మెన్ అధికారి శివరాం, ఎస్పీఎం వేణు, ఎస్‌ఆర్‌పీ దేవేందర్, ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, ఎంపీఓ శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీఓ నరేష్ ఉన్నారు.



నివేదిక చదివి వినిపిస్తున్న ఈజీఎస్ సిబ్బంది

'విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం'

బెల్లంపల్లిరూరల్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ అన్నారు. మూడో రోజు మంగళవారం బీఆర్‌ఎస్వీ గురుకుల బాటలో భాగంగా బెల్లంపల్లి మండలం లంబాడితండా శివారులోని తెలంగాణ బాలుర గురుకుల పాఠశాల–కళాశాలను సందర్శించారు. బీఆర్‌ఎస్వీ నాయకులు పాఠశాలలోకి వెళ్లకుండా సిబ్బంది పాఠశాల ప్రధాన ద్వారానికి తాళం వేయడంతో నాయకులు గేటు వద్ద నిరసన చేపట్టారు. పాఠశాల ప్రిన్సిపాల్ సత్తయ్య, తాళ్లగురిజాల పోలీసులు అక్కడికి చేరుకొని నాయకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ గురుకులాల్లోని సమస్యలు బయటకు వస్తాయని ప్రభుత్వం పాఠశాలలకు తాళం వేయడం సిగ్గుచేటు అన్నారు. హాజీపూర్ మండలంలోని ముల్కల్ల, గుడిపేటలోని సాంఘిక సంక్షేమ, జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల పరిశీలనకు వెళ్లిన బీఆర్‌ఎస్వీ నాయకులను గురుకుల అధికారులు, పోలీసులు లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో నాయకులు గురుకులాల గేట్ల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గేట్ వద్దకు విద్యార్థులను పిలిపించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

బొగ్గుబాయి వార్తలు

పదోన్నతి పత్రాలు అందజేత



పదోన్నతి పత్రాలు పొందిన కార్మికులతో మేనేజర్

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 2గనిపై 2024–25సంవత్సరంలో వివిధ కేటగిరిలలో యాక్టింగ్ చేసిన కార్మికులకు మంగళవారం గని మేనేజర్ లక్ష్మీనారాయణ పదోన్నతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో గుర్తింపుసంఘం పిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్, అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షులు దొడ్డిపట్ల రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్దపల్లి పర్యటనలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపుదలపై నిర్దిష్ట ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

శ్రీరాంపూర్‌లో 88 శాతం ఉత్పత్తి

- జీఎం సూర్యనారాయణ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో నవంబర్ నెలలో నిర్ధేశించిన ఉత్పత్తి లక్ష్యంలో 88శాతం ఉత్పత్తిని సాధించినట్లు ఏరియా జీఎం ఎల్వీ సూర్యనారాయణ తెలిపారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. నవంబర్ నెల నిర్ధేశించిన లక్ష్యం 5.75లక్షల టన్నులకు గాను 5.04లక్షల టన్నులు సాధించినట్లు తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి నవంబర్ 30వరకు 40.71లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి గాను 29.75లక్షల టన్నుల ఉత్పత్తి సాధించి 73శాతం లక్ష్యాన్ని నమోదు చేశామన్నారు. ఇందారం ఓపెన్ కాస్ట్ గనిలో ఓబీ వెలికితీత సమస్య వల్ల అనుకున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించలేకపోయామన్నారు. బొగ్గు రవాణాలో కూడా సత్ఫలితాలు సాధించామన్నారు. భూగర్భగనుల్లో స్టవ్వింగ్ మెటీరియల్ కొరత కూడా ఉత్పత్తి తగ్గడానికి కొంత కారణమన్నారు. బుధవారం పెద్దపల్లిలో జరిగే ముఖ్యమంత్రి సభలో శ్రీరాంపూర్ నుంచి 80మందికి సీఎం చేతుల మీదుగా కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 9నుంచి 16వరకు రక్షణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఎస్టుజీఎం సత్యనారాయణ, డీజీఎంలు అరవిందరావు(పర్సనల్), చిరంజీవిలు(ఐఈడీ), పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, సీనియర్ పీఓ కాంతారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం ఎల్వీ సూర్యనారాయణ

నల్లబ్యాడ్జీలతో నిరసన

రామకృష్ణాపూర్: హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ అరెస్టును ఖండిస్తూ రామకృష్ణాపూర్‌లోని సీహెచ్‌పీలో మంగళవారం కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. యూనియన్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ జె.శ్రీనివాస్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ పార్వతి రాజిరెడ్డి మాట్లాడుతూ పెద్దపెల్లిలో జరుగనున్న ముఖ్యమంత్రి సభలో కార్మికుల సమస్యలపై ఎక్కడ నిలదీస్తారోనన్న ఆలోచనతో రియాజ్ అహ్మద్‌ను అక్రమంగా అరెస్టు చేయటం సరికాదన్నారు. నాయకులు రామస్వామి, ప్రభాకర్, అశోక్ పాల్గొన్నారు.



ఐకే1ఏ గనిపై నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

జైపూర్: మండలంలోని ఇందారం ఐకే1ఏ గనిపై మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. రియాజ్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ నాయకులు సారయ్య, అనిల్‌రెడ్డి, కొమురయ్య, లక్ష్మణ్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణతోనే ఆరోగ్యం

మంచిర్యాలఅర్బన్: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని, ఆరోగ్యాన్ని పాడు చేసే కారకాలైన వివిధ కాలుష్యాలకు నివారణ మాత్రమే మార్గమని ఎన్‌సీడీపీవో డాక్టర్ ప్రసాద్ అన్నారు. పాత మంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ వాయు కాలుష్య నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు సంగీత, డీపీవో ప్రశాంతి, సీహెచ్‌వో డీపీవో ఎన్‌సీడీ లింగారెడ్డి సీహెచ్‌వో బి.దీక్షితారాణి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధి తలమల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాధికారి యాదయ్య మంగళవారం సందర్శించారు.

ప్రజాపాలనపై కళాజాత

నెన్నెల: మండలంలోని నెన్నెల, మైలారం, గొల్లపల్లి గ్రామాల్లో మంగళవారం సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవ కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఆరు గ్యారంటీల గురించి ప్రజలకు వివరించారు.

'ఆరు హామీలు అరవై ఆరు మోసాలు'

చెన్నూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలని చెప్పి అరవై ఆరు మోసాలు చేస్తుందని బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు. బీజేపీ కార్యాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాల పై చార్జిషీట్లను విడుదల చేశారు.

అకాల వర్షంతో అన్నదాత ఆగమాగం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అకాల వర్షం రైతులను ఆందోళనకు గురిచేసింది. మంగళవారం రాత్రి ఒక్కసారిగా కురిసిన అకాల వర్షంతో రైతులు తేరుకునే లోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కల్లాల్లోనే కాకుండా ఇళ్ల వద్ద, రోడ్లపై ఆరబెట్టుకున్న ధాన్యం వర్షంతో తడిసిపోయింది.

సంక్షిప్త వార్తలు

ఓపెన్ ప్రవేశాలకు గడువు పొడగింపు

దండేపల్లి: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేరేందుకు ఈ నెల 11వరకు మరో అవకాశం కల్పించినట్లు దండేపల్లి ఓపెన్‌స్కూల్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, సహాయ కో ఆర్డినేటర్ రాజేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ పొందేవారు ధ్రువీకరణ పత్రాలతో దండేపల్లి ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం 83097 69067లో సంప్రదించవచ్చన్నారు.

గిరిజన గ్రామాల్లో సికిల్‌సెల్ పరీక్షలు

జన్నారం: మండలంలోని తపాలపూర్, కొలాంగూడ గిరిజన గ్రామాల్లో మంగళవారం సికిల్‌సెల్, ఎనిమియా పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత, పోషకాహార లోపం ఉన్న వాళ్లకు పలు సూచనలు చేశారు. పౌష్టికాహారం తీసుకోవాలని, రక్తహీనతతో ఇబ్బందులు ఏర్పడుతాయని తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ సందీప్, హెల్త్ అసిస్టెంట్లు కమలాకర్, మాధవి, విజయ, ఆశ, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

కిష్టాపూర్ విద్యార్థికి రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి

జన్నారం: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ నిర్వహించిన 'పునరుత్పాదక శక్తి వనరులు' అనే అంశంపై మంగళవారం హైదరాబాద్‌లోని నాంపల్లి ప్రభుత్వ ఆదర్శ అలియా పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జన్నారం మండలం కిష్టాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి వేల్పుల నరేందర్ రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. తెలంగాణ సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన, విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ లింగయ్య నుంచి బహుమతి, ప్రశంసా పత్రం అందుకున్నట్లు పాఠశాల హెచ్ఎం రాజన్న, పాఠశాల ఉపాధ్యాయులు దాముక కమలాకర్ తెలిపారు.

ఆక్రమ స్థలం హద్దుల గుర్తింపు

వేమనపల్లి: దస్నాపూర్ శివారులోని వేమనపల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల వద్ద మంగళవారం ఏడీఎస్ఎల్ఆర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ కాలిక్ ఆధ్వర్యంలో కొలతలు చేసి హద్దులు గుర్తించారు. పెద్ద చెరువు ఆక్రమణపై ఎందుకు స్పందించడం లేదని ఏడీని గ్రామస్తులు విన్నవించారు. ఫిర్యాదు చేసి నాలుగు నెలలు అయినా, చెరువు వద్దకు వెళ్లి చూస్తున్నారే తప్పా కబ్జాదారుల నుంచి కాపాడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

'పంట సాగు చేసుకోనివ్వద్దు'

వేమనపల్లి: ఆక్రమణలో ఉన్న గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల భూమిలో ఎవరినీ పంట సాగు చేయనివ్వద్దని ఏడీఎస్ఎల్ఆర్ శ్రీనివాస్‌రెడ్డికి గిరిజన సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. 80సర్వే నంబర్‌లో ఆరు ఎకరాల 23గుంటల భూమి ఆశ్రమ పాఠశాల కోసం ఉందన్నారు. గిరిజనేతర కులాలకు చెందిన వారు కబ్జా చేసుకొని ఆశ్రమ పాఠశాలకు చెందకుండా రాజకీయం చేస్తున్నారని, ఆ భూమిలో హద్దులు పెట్టించి పాఠశాలకు అప్పగించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


జైపూర్: మండలంలోని ఇందారం క్రాస్‌రోడ్డు సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్సెట్టిపేటకు చెందిన విజయ్, సూర్యం గాయపడ్డారు. మెరుగైన వైద్యం కోసం వారిని కరీంనగర్‌కు తరలించారు.

పెండింగ్ నిధులు విడుదల చేయాలి

మందమర్రిరూరల్: మందమర్రి మండలానికి ప్రభుత్వం ద్వారా 2020–21ఆర్థిక సంవత్సరం లబ్ధిదారుల కోసం మంజూరైన ఎస్సీ కార్పొరేషన్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆసంపల్లి శివకుమార్, పట్టణ అధ్యక్షుడు చిలుముల రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎంపీడీవో రాజేశ్వర్‌ను కలిసి మంగళవారం వినతిపత్రం అందించారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

భీమారం/నెన్నెల/జన్నారం/మందమర్రిరూరల్/కాసిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సింగరేణి తరుపున కాసిపేట 2ఇంక్లైన్ సంక్షేమాధికారి భార్గవ్ దివ్యాంగులకు లంచ్ హాట్ బాక్స్‌లు అందజేశారు. సమస్యలు పరిష్కరించాలని కాసిపేట వికలాంగుల వేదిక ఆధ్వర్యంలో తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణసింగ్‌కు వినతిపత్రాలు సమర్పించారు. పద్దనపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గల భవిత కేంద్రంలో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన దివ్యాంగులకు బహుమతులు, మిఠాయిలు అందజేశారు. మందమర్రి సింగరేణి హైస్కూల్ ఆవరణలోని మనోవికాస పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి జీఎం దేవేందర్ హాజరయ్యారు. క్రీడలు నిర్వహించి గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. జన్నారం మండలంలోని పొనకల్‌లో గల భవిత సెంటర్‌లో విద్యార్థుల తల్లిదండ్రులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల కోసం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. భీమారం మండల కేంద్రంలోని వనరుల కేంద్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. నెన్నెల మండలం దుబ్బపల్లి(ఎస్) ప్రాథమిక పాఠశాల, ఐఈఆర్‌సీ కేంద్రంలో ఎంఈవో చంద్రశేఖర్ రెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం చంద్రశేఖర్, దివ్యాంగులతో కేక్ కట్ చేయించి సంబురాలు జరిపారు.



కాసిపేట: ఐకేపీ కార్యాలయంలో...

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

చెన్నూర్: సామాజిక ఆరోగ్య కేంద్రంలో మగవారికి కుటుంబ సంక్షేమం కోసం 31మందికి డిప్యూటీ వైద్యాధికారి అనిత ఆధ్వర్యంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసినట్లు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సత్యనారాయణ తెలిపారు. వైద్యులు పాల్గొన్నారు.